సాక్షి
కామారెడ్డి

సోమవారం, 8, సెప్టెంబర్, 2025

చంద్ర గ్రహణం సంపూర్ణం

ఆదివారం రాత్రి 9.56 గంటలకు ప్రారంభమైన చంద్రగ్రహణం అర్ధరాత్రి 1.26గంటలకు సంపూర్ణమైంది. గ్రహణ దృశ్యాలను ప్రజలు ఆసక్తిగా తిలకిస్తూ తమ సెల్‌ఫోన్‌లలో బంధించారు.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



రాత్రి 10.00 | రాత్రి 10.10 | రాత్రి 10.15 | రాత్రి 10.21 | రాత్రి 10.46

న్యూస్‌రీల్

షబ్బీర్ అలీ కారుకు ప్రమాదం



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: జిల్లా కేంద్రంలో ఈనెల 15న నిర్వహించే సభ కోసం స్థలాన్ని పరిశీలించేందుకు వెళ్తుండగా.. షబ్బీర్ అలీ కారు డ్యామేజీ అయ్యింది. మంత్రులు, నాయకుల కాన్వాయ్ మధ్యలోకి ఓ కారు రావడంతో దాన్ని తప్పించే ప్రయత్నంలో షబ్బీర్ అలీకి చెందిన బుల్లెట్ ప్రూఫ్ కారు డివైడర్‌ను ఢీకొట్టింది. కారు డ్యామేజీ అయ్యింది. అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

'విశ్రాంత ఉద్యోగులను అవమానిస్తున్న ప్రభుత్వం'



కామారెడ్డి అర్బన్: విశ్రాంత ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం అవమానిస్తోందని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. కామారెడ్డిలోని కర్షక్ బీఈడీ కళాశాలలో ఆదివారం అసోసియేషన్ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశం, నూతన కార్యవర్గం ఎన్నికలు జరిగాయి. ఉద్యోగ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు, బకాయిలు వెంటనే చెల్లించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా వి.హన్మంతురెడ్డి, ప్రధాన కార్యదర్శిగా విజయ రామరాజు మళ్లీ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సీమ గంగారాం, శంకరయ్య, కార్యదర్శులుగా రవీందర్, సత్యనారాయణ, ఎస్.నర్సింహారెడ్డి, హెచ్. రాజలింగయ్య, సుబ్రహ్మణ్యం, సలహాదారులుగా కె.వేణుగోపాల్, రాష్ట్ర ప్రతినిధిగా డాక్టర్ జి.లచ్చయ్య ఎన్నికయ్యారు.

రామకృష్ణ మఠ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



కామారెడ్డి క్రైం: ఇటీవల వరద ప్రభావానికి గురైన కామారెడ్డి పట్టణంలోని జీఆర్ కాలనీలో ఆదివారం రామకృష్ణ మఠ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కాలనీకి చెందిన 63 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులు అందించారు. కార్యక్రమంలో రామకృష్ణ మఠ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహేశ్‌కుమార్‌గౌడ్, వేదికపై మంత్రులు పొంగులేటి, సురేఖ, పొన్నం, సీతక్క, శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు

కనువిప్పు కలిగిస్తాం

- కామారెడ్డిలో రెండు లక్షల మందితో సభ నిర్వహిస్తాం
- కేంద్రంపై సమర శంఖం పూరిస్తాం
- బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత సాధించడమే లక్ష్యం
- మోదీ ఇవ్వకపోతే రాహుల్ ప్రధాని కాగానే అమలు చేస్తాం
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేందుకు కామారెడ్డిలో ఈనెల 15న నిర్వహించే సభను విజయవంతం చేయాలని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని కన్వెన్షన్ సెంటర్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ముఖ్య నేతలు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీన వర్గాల పార్టీ అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసి తీరుతామన్నారు. బీస్థానిక సంస్థల ఎన్నికల్లోనే కాకుండా విద్య, ఉద్యోగాల్లోనూ రిజర్వేషన్ల అమలు కోసం తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. దానికి చట్టబద్ధత ఇవ్వాల్సిన కేంద్రం మోకాలడ్డుతోందని ఆరోపించారు. బీసీ బిల్లును ఆపుతున్న వారి భరతం పట్టడానికి 15న కామారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రెండు లక్షల మందితో సభ నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈ రోజు మోదీని పట్టుకుని బీసీ బిల్లును ఆపగలుగుతున్నారని, రాహుల్ గాంధీ ప్రధాని అవగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని స్పష్టం చేశారు.



సభాస్థలిని పరిశీలిస్తున్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, నేతలు

అందరూ కృషి చేయాలి

కామారెడ్డిలో నిర్వహించే బహిరంగ సభకు భారీ ఎత్తున జనం తరలివచ్చేలా పార్టీ నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. రాష్ట్రంలో కులగణన శాస్త్రీయంగా జరిగిందన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కారుకూతలు కూసినా, ఎన్ని కుట్రలు చేసినా చిత్తశుద్ధితో బీసీ బిల్లు తీర్మానం చేశామన్నారు.

నిజాయితీగా బిల్లును ఆమోదించాం

ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి ఉద్దేశించిన బిల్లును నిజాయితీగా ఆమోదించామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి పంపిన బిల్లును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. సామాజిక న్యాయం జరగాలనే ఉద్దేశంతో పదవుల్లో బీసీలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.

రేవంత్‌రెడ్డి సారథ్యంలో బీసీలకు న్యాయం

సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం బీసీలకు న్యాయం చేస్తోందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ పేర్కొన్నారు. కామారెడ్డిలోనే బీసీ డిక్లరేషన్ ప్రకటించారన్నారు. బీసీ బిల్లును ఆమోదించిన తర్వాత కామారెడ్డిలోనే సభ నిర్వహించే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతారావు, సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ఆది శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.

అమలు చేసి తీరుతాం..

ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామని రవాణా, బీసీ వెల్ఫేర్ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బీసీ బిల్లుకు కేంద్రం చట్టబద్ధత కల్పించాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ డిమాండ్ చేశారు. బీసీలు పెద్ద సంఖ్యలో సభకు తరలివచ్చి ఐక్యత చాటాల్సిన అవసరం ఉందని పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, కార్పొరేషన్ల చైర్మన్లు మానాల మోహన్‌రెడ్డి, ఈరవత్రి అనిల్, తాహెర్‌బిన్ హందాన్, కాసుల బాల్‌రాజ్, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు ఏనుగు రవీందర్‌రెడ్డి, ఆకుల లలిత, నాయకులు అరికెల నర్సారెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఇందుప్రియ, ఇంద్రకరణ్‌రెడ్డి, నర్సింగరావు, విజయ్‌కుమార్‌రెడ్డి, మామిండ్ల అంజయ్య, మోహన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, పండ్ల రాజు, గూడెం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్‌లోకి రికార్డు స్థాయి వరదలు

- ఈ సీజన్‌లో 125 టీఎంసీల ఇన్‌ఫ్లో
- 111.53 టీఎంసీల అవుట్‌ఫ్లో
- కొనసాగుతున్న నీటి విడుదల

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఈ ఏడాది రికార్డు స్థాయిలో వరద నీరు వచ్చి చేరింది. ఇప్పటికే 125 టీఎంసీల ఇన్‌ఫ్లో రావడం గమనార్హం. ఇంకా వర్షాకాలం మిగిలి ఉన్నందున ఇన్‌ఫ్లో రికార్డు మరింత మెరుగయ్యే అవకాశాలున్నాయి.

1920 సంవత్సరంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కరువు కోరల్లో చిక్కుకుంది. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో ఉమ్మడి జిల్లా ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాగు నీరు లేక పంటలు సాగు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో అప్పటి పాలకులు భారీ సాగు నీటి ప్రాజెక్టు నిర్మించాలని నిర్ణయించారు. ఏడాది పాటు సర్వే చేసి అచ్చంపేట- బంజపల్లి గ్రామాల మధ్య గోదావరి ఉపనదిపై సాగునీటి ప్రాజెక్టుకు అనువైన స్థలం ఉందని గుర్తించారు. 2.75 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించాలన్న లక్ష్యంతో 1923 సంవత్సరంలో చీఫ్ ఇంజినీర్ నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించారు. డిప్యూటి చీఫ్ ఇంజినీర్ సీసీ పాలె, అసిస్టెంట్ ఇంజినీర్ ఎస్‌జే తారాపూర్‌ల పర్యవేక్షణలో ప్రాజెక్టు పనులు సాగాయి. 1931 సంవత్సరంలో నిర్మాణం పూర్తయ్యింది. నిజాంసాగర్ ప్రాజెక్టును 'ఎస్' ఆకారంలో 1,405.05 అడుగుల నీటిమట్టం, 30 టీఎంసీల నీరు నిలువ ఉండేలా నిర్మించారు.

ఇది రెండోసారి..

నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన తర్వాత ఈ స్థాయిలో వరద నీరు రావడం ఇదే రెండోసారి. గతంలో 1998 సంవత్సరంలో నిజాంసాగర్ ప్రాజెక్టుకు 167 టీఎంసీ ఇన్‌ఫ్లోగా వచ్చింది. అప్పట్లో నిజాంసాగర్ వరద గేట్లతో పాటు ప్రధాన కాలువ ద్వారా 157 టీఎంసీల నీటిని మంజీర నదిలోకి వదిలారు. 1998 తర్వాత ఈ ఏడాది మళ్లీ భారీ వరదలు వస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే ప్రాజెక్టులోకి 125 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు ఎగువన ఉన్న పాత మెదక్ జిల్లాలో వానలు దంచికొట్టడంతో రికార్డు స్థాయిలో వరదలు వచ్చాయి. గత నెల 28 న ఒకరోజులో గరిష్ఠంగా 2.5 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. అంతే స్థాయిలో 27 వరద గేట్ల ద్వారా నీటిని దిగువకు వదిలారు. ఇది ప్రాజెక్టు చరిత్రలో రికార్డుగా నిలిచింది.



ప్రాజెక్టు గేట్ల ద్వారా విడుదలవుతున్న వరద నీరు

మూడు వారాల్లో..

గత నెల 18 నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా నీటి విడుదల ప్రారంభమైంది. గతనెల 25 ఒక్క రోజు మాత్రమే వరద గేట్లను మూసివేశారు. ఇన్‌ఫ్లో వస్తుండడంతో నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. ఈ మూడు వారాల్లో 111.53 టీఎంసీల నీటిని నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్ల ద్వారా మంజీర నదిలోకి వదిలారు. ఎగువ ఉన్న సింగూరు ప్రాజెక్టు గేట్ల ద్వారా నీటి విడుదల చేపట్టడంతో పాటు హల్దీవాగు, ఘనపురం ఆనకట్ట ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం 23,220 క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లోగా వస్తోంది. దీంతో ప్రాజెక్టు 3 వరద గేట్ల ద్వారా 17,865 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు.



నిండుకుండలా ఉన్న నిజాంసాగర్ ప్రాజెక్టు

ప్రాజెక్టు అద్భుతం

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మించి వందేళ్లయినా ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉందని, ఇది అద్భుతమని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగువ నుంచి వరద ఉధృతంగా వస్తున్నా, ప్రాజెక్టు నుంచి ఆటోమెటిక్ సిస్టమ్ లేకున్నా, మ్యాన్‌వల్‌గా నీటిని విడుదల చేస్తున్న నీటిపారుదలశాఖ అధికారులు, సిబ్బంది పనితీరును ఆయన అభినందించారు. ఎమ్మెల్యే వెంట నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి దంపతులు, నాయకులు ఉన్నారు.



ప్రాజెక్టును సందర్శించిన అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కుటుంబంతో నాయకులు

'పోచారం' వద్ద పర్యాటకుల సందడి

పోచారం ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు కావడంతో వందల సంఖ్యలో పర్యాటకులు తరలి వచ్చారు. ప్రాజెక్టు చిన్నఅలుగు పైనుంచి దిగువకు జాలువారుతున్న నీటిలో ఉత్సాహంగా గడిపారు. దీంతో చాలాకాలం తర్వాత పోచారం ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి నెలకొంది.

- నాగిరెడ్డిపేట



విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

- చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి
- మంత్రులు పొన్నం, వాకిటి

భిక్కనూరు: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంతి పొన్నం ప్రభాకర్, క్రీడలు, పశుసంవర్థక శాఖల మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. ఆదివారం వారు జంగంపల్లిలోని బీసీ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నతనంలోనే లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగితే భవిష్యత్తు బంగారుమయం అవుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. పాఠశాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, విధిగా మెనూ అమలు చేయాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలోని సమస్యలు, విద్యాబోధన గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, పక్కన మంత్రి శ్రీహరి

'నాణ్యమైన ఆహార ఉత్పత్తులు అందించాలి'



కామారెడ్డి రూరల్: హోటల్ వ్యాపార నిర్వాహకులు, దుకాణాల యజమానులు వినియోగదారులకు నాణ్యమైన ఆహార ఉత్పత్తులు అందించాలని ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) శిక్షకురాలు భార్గవి కంచాల సూచించారు. మహారాష్ట్ర సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(ఎంసీఈడీ) ఆధ్వర్యంలో ఆదివారం కామారెడ్డి పట్టణంలోని వశిష్ఠ డిగ్రీ కాలేజీలో దుకాణదారులు, హోటల్ వ్యాపార నిర్వాహకులకు శిక్షణ ఇచ్చారు. శుచి, శుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు. ఆహార పదార్థాలలో ఫుడ్ కలర్స్, టెస్టింగ్ సాల్ట్ వినియోగించరాదన్నారు. కార్యక్రమంలో ఎంసీఈడీ రీజినల్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, కామారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ కొప్పుల రవి, సిబ్బంది దేవరాజ్, నవీన్, కృష్ణ, అనిల్, సతీష్, అనిల్, పలువురు దుకాణదారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందిస్తూ..

- ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన లాల్‌సింగ్

నిజాంసాగర్: నాణ్యమైన విద్య అందిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్న అచ్చంపేట ప్రాథమిక పాఠశాల టీచర్ లాల్‌సింగ్ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. సోమవారం జిల్లాకేంద్రంలో నిర్వహించే కార్యక్రమంలో ఆయన ఈ అవార్డు అందుకోనున్నారు.

విద్యార్థుల సంఖ్య డబుల్..

లాల్‌సింగ్ 2022 సంవత్సరంలో అచ్చంపేట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరారు. ఆ సమయంలో ఐదు తరగతులలో కలిపి యాభై మంది విద్యార్థులున్నారు. నాణ్యమైన విద్య అందిస్తూ విద్యార్థులలో పఠనాసక్తి పెంపొందించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడి రూపురేఖలు మార్చడానికి కృషి చేస్తున్నారు. పూర్వ విద్యార్థి సహకారంతో తరగతి గదుల్లో పెయింటింగ్ వేయించారు. విద్యార్థులకు ఉపయోగపడే వాల్ పోస్టర్లు అతికించారు. ప్రతినెలా పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తున్నారు. విద్యార్థుల ప్రగతిని వారికి వివరిస్తున్నారు. మంచి విద్య అందిస్తుండడంతో ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు సైతం సర్కారు బడి వైపు చూస్తున్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 105 మంది విద్యార్థులున్నారు. దాతల సహకారంతో విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లు, బ్యాడ్జీలు అందించారు. పాఠశాలలో అర్ధంతరంగా నిలిచిన తరగతి గదుల నిర్మాణ పనులను ఇటీవల కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన గదుల నిర్మాణ పనులకు రూ. 4 లక్షలు మంజూరు చేశారు. ఇలా విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న లాల్‌సింగ్ జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు.



పాఠం చెబుతున్న లాల్‌సింగ్

కన్నబిడ్డల్లా చూసుకుంటా



ఎక్కడ పనిచేసినా బడికి వచ్చే పిల్లలను కన్నబిడ్డల్లా చూసుకుంటాను. వారికి విద్యాబుద్ధులు నేర్పడంతోపాటు పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తుంటా. అందరి సహకారం వల్లే బడి రూపురేఖలు మార్చగలిగా.

- లాల్‌సింగ్, ప్రధానోపాధ్యాయుడు, అచ్చంపేట

పశువైద్యశాలలో మందుల కొరత

- నరఫరా చేయని అధికారులు
- గొర్రెలు, మేకలు, దూడలకు అందని టీకాలు
- బయటి మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి
- మద్నూర్ ఉమ్మడి మండలంలో ఇబ్బందులు పడుతున్న పశుపోషకులు


మద్నూర్‌లోని పశువైద్యశాల


మద్నూర్‌లో లంపి స్కిన్ సోకిన దూడ

మద్నూర్(జుక్కల్): మద్నూర్ ఉమ్మడి మండలం లోని పశువైద్యశాలలో మందుల కొరత వేధిస్తోంది. పశువులకు గాయాలైన.. జ్వరం వచ్చిన కనీసం మందులు, టీకాలు లేకుండా పశువైద్యశాలలు కొన సాగుతున్నాయని పశుపోషకులు ఆందోళన చెందుతున్నారు. మద్నూర్, మేనూర్, డోంగ్లీలో పశు వైద్యశాలలు ఉన్నాయి. ప్రభుత్వం, ఉన్నతాధికారులు పశువైద్యశాలలను పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో మూగజీవాలకు వైద్యం అందడం లేదని పశుపోషకులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రతి సంవత్సరం పశువులు వ్యాధుల బారిన పడి మృతిచెందుతున్నాయి. దీంతో పాటు పశువైద్యశాలల్లో పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది లేరు.ఈ ఆస్పత్రులకు ఉన్నతాధికారులు మందులు సక్రమంగా సరఫరా చేయకపోవడం సమస్యగా మారింది.

లంపి స్కిన్ వ్యాధితో రైతుల ఆందోళన

ప్రస్తుతం దూడలకు లంపి స్కిన్ వ్యాధి సోకడంతో పశుపోషకులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. వైద్య కోసం పశువైద్యశాలకు వెళ్తే అక్కడ మందులు లేవని సిబ్బంది చెబుతున్నారని పశుపోషకులు వాపోతున్నారు. దీంతో సరిహద్దున ఉన్న దెగ్లూర్‌కు దూడలను తరలించి వైద్యం చేయిస్తున్నారు. గొర్రెలు, మేకలకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నట్టల నివారణ మందు వేసేవారని గత రెండు సంవత్సరాలుగా వేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువైద్య అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పశువులకు మందులు అందుబాటులో ఉంచాలని, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు అందించాలని పశుపోషకులు కోరుతున్నారు. ఈ విషయమై మద్నూర్ వెటర్నరీ అసిస్టెంట్ సునీతను వివరణ కోరగా మద్నూర్ పశువైద్యశాలలో మందులు లేక కొంత ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్నతాధికారుల నుంచి పశువులకు మందులు సరఫరా కావడం లేదు. ఈ విషయమై ఉన్నతాధికారులకు తెలియజేశాం. లంపి స్కిన్ వ్యాధితో పశువులను పశుపోషకులు తీసుకువస్తున్నారు. గొర్రెలకు, మేకలకు వేసే నట్టల నివారణ మందులు ఇంకా రాలేదు.

మందులు అందుబాటులో లేవు



మద్నూర్ పశువైద్యశాలలో పశువులకు మందులు అందుబాటులో ఉండటం లేదు. రెండు దూడలకు లంపి స్కిన్ వ్యాధి సోకడంతో మద్నూర్ పశువైద్యశాలకు తీసుకెళ్లాం. అక్కడి సిబ్బంది మందులు లేవని చెప్పారు. దీంతో చేసేదేమీ లేక దేగ్లూర్ నుంచి మందులు తీసుకొచ్చి వేశాం. – శ్యామ్, పశుపోషకుడు, మద్నూర్

చంద్రగ్రహణంతో ఆలయాల మూసివేత


భిక్కనూరు శ్రీసిద్ధరామేశ్వరాలయాన్ని మూసివేస్తున్న అర్చకుడు, ఆలయ కమిటీ ప్రతినిధులు


ఎల్లారెడ్డిలో మూసివేసిన నీలకంఠేశ్వరాలయం


తాడ్వాయిలోని శబరిమాత ఆలయం

ఎల్లారెడ్డిరూరల్/తాడ్వాయి/భిక్కనూరు/మాచారెడ్డి/ దోమకొండ: జిల్లాలోని పలు ఆలయాలను ఆదివారం సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా మూసివేశారు. ఈసందర్భంగా ఆలయాల కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ సోమవారం ఆలయాలను సంప్రోక్షణ చేసిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పిస్తామని పేర్కొన్నారు. భిక్కనూరు శ్రీసిద్ధరామేశ్వరాలయం, మాచారెడ్డి మండలం చుక్కాపూర్ లక్ష్మీనరసింహస్వామి, దోమకొండలోని చాముండేశ్వరి, తాడ్వాయిలోని శబరిమాత , ఎల్లారెడ్డిలో సాయిబాబా, నీలకంఠేశ్వరాలయాలను మూసివేశారు.


దోమకొండలోని చాముండేశ్వరి ఆలయం


చుక్కాపూర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయం

బిచ్కుందకు 13 మంది జీపీవోలు


బిచ్కుంద తహసీల్ కార్యాలయం

బిచ్కుంద(జుక్కల్): రెవెన్యూ వ్యవస్థలో మార్పులు తీసుకొస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పాలనాధికారులను నియమించింది. బిచ్కుంద మండలంలో 23 గ్రామ పంచాయతీలు, ఒక మున్సిపాలిటీ ఉంది. 13 నుంచి 15 మంది జీపీవోలు వస్తున్నట్లు తెలిసింది. అన్ని రకాల సర్టిఫికెట్ల దరఖాస్తుల పరిశీలన, రెవెన్యూ రికార్డులు, భూ సమస్యలు, పహాణీలు గతంలోలాగే గ్రామంలో అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరానికి వారు కృషి చేయనున్నారు. తిరిగి జీపీవోలు రాకతో తహసీల్ కార్యాలయం సిబ్బంది, అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రహదారికి తాత్కాలిక మరమ్మతులు



నిజాంసాగర్(జుక్కల్): ఎల్లారెడ్డి– బాన్సువాడ ప్రధాన రహదారికి ఆదివారం తాత్కాలిక మరమ్మతు పనులు ప్రారంభించారు. 'మరమ్మతులకు నోచుకోని రహదారి' అని ఆదివారం ప్రచురితమైన కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. తుంకిపల్లితండా వద్ద రహదారి మధ్యలో గుంతను పూడ్చి వేసి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. అలాగే బొగ్గుగుడిసె చౌరస్తా వద్ద వరద ప్రవాహానికి కోతకు గురైన రహదారికి మట్టి, మొరం వేసి తాత్కాలికంగా మరమ్మతులు చేపడుతున్నారు. ఈమరమ్మతులు పూర్తయితే బస్సు సర్వీసులను పునరుద్ధరించున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

ముళ్ల పొదలను తొలగించారు



మద్నూర్(జుక్కల్): డోంగ్లీ–లింబూర్ ప్రధాన రహదారిపై గల ముళ్లపొదలను ఆర్‌అండ్‌బీ అధికారులు ఆదివారం జేసీబీతో తొలగించారు. ఈ నెల 2న 'రోడ్డును కమ్మేసినా కనపడటం లేదా?' అని ప్రచురితమైన వార్తకు ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. డోంగ్లీ మండల కేంద్రం నుంచి లింబూర్ రహదారిపై ముళ్లపొదలు బాగా పెరిగిపోయి రోడ్డును కమ్మేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం అధికారులు రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలను తొలగించడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శాశ్వత పరిష్కారం చూపేదెన్నడో..


నాగారం వద్ద కొట్టుకుపోయిన కాసుల కత్తె వంతెన, రోడ్డు


ధ్వంసమైన మెంగారం శివారులోని లోలెవల్ వంతెన

- లింగంపేట మండలంలో వరదలు వస్తే రాకపోకలు బంద్
- ధ్వంసమైన వంతెనలకు పూర్తి స్థాయి మరమ్మతులు చేపట్టాలని వినతి

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండలం నాగారం కాసులకత్తె వంతెన గత మూడేళ్లుగా వర్షాకాలంలో కురుస్తున్న వర్షాలకు కొట్టుకుపోతుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. వంతెన, రోడ్డు కొట్టుకుపోవడంతో నాగారం, బాయంపల్లి, కొర్పోల్, బాణాపూర్, కిషన్‌నాయక్ తండా, లక్ష్మన్‌నాయక్‌తండా, లింగంపల్లి, లింగంపేట, నల్లమడుగు, ముస్తాపూర్, తదితర గ్రామాలు, తండాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు తాత్కాలికంగా మొరం వేసి రాకపోకలు పునరుద్ధరిస్తున్నారు. వంతెనకు ఇరువైపులా రోడ్డు వేసి సపోర్టుగా ప్రహరీ కట్టించాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే పొల్కంపేట శివారులో బండ్రేవ్ ఒర్రె వద్ద, బాణాపూర్, గాంధారి రోడ్డులో మెంగారం ఊర చెరువు కింద నిర్మించిన లోలెవల్ బ్రిడ్జిలు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ధ్వంసమయ్యాయి. దాంతో లింగంపేట పొల్కంపేట, లింగంపేట గాంధారి రూట్లో వర్షాలు వస్తే రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ బ్రిడ్జిలు ఎత్తు పెంచాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సదరు వంతెనలకు శాశ్వత పరిష్కారం చూపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు


ఉత్తునూర్ గ్రామ శివారులో ప్రమాదకరంగా మారిన కల్వర్టు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని ఉత్తునూర్ గ్రామ శివారులో ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు పూర్తిగా కొట్టుకు పోవడంతో రోడ్డు కోతకు గురైంది. ప్రతి రోజు ఉత్తునూర్ గ్రామ ప్రజలే కాకుండా యాచారం ప్రజలు, కొందరు నిజామాబాద్ వెళ్లే వారు ఈ రోడ్డు గుండా ప్రయాణం సాగిస్తుంటారు. రాత్రింబవళ్లు ఈ దారి గుండా రాకపోకలు సాగుతుంటాయి. ఈ కల్వర్టు పూర్తి దెబ్బతినడంతో ప్రయాణికులు ఈ దారి గుండా రావాలంటే జంకుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకరంగా మారిన కల్వర్టు వద్ద సంబంధిత శాఖ అధికారులు ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికి దృష్టి సారించలేదు. దీంతో గ్రామస్తులే ఆరెంజ్ కలర్‌లో ఉన్న దుస్తుల పేలికలను రోడ్డుకు అడ్డంగా కట్టారు. దీంతో ఈ దారి గుండా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైన సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించి ప్రమాదకరంగా మారిన కల్వర్టుకు వెంటనే మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గట్టుమీద పచ్చదనం

బాన్సువాడ రూరల్: ఇటీవల కురిసిన భారీవర్షాలతో పంటల చీడపీడలు దూరమయ్యాయి. కొన్నిరోజులుగా ఎండలు కాస్తుండటంతో మండలంలోని గట్టుమీది గ్రామాల్లో ఆరుతడి పంటలు పచ్చదనాన్ని సంతరించుకున్నాయి. మండలంలోని కోనాపూర్, హన్మాజీపేట్, సంగోజీపేట్, కాద్లాపూర్ తదితర గ్రామాలు, తండాల్లో సాగవుతున్న కంది, మొక్కజొన్న, సోయా, పత్తిపంటలు ఆశాజనకంగా ఉన్నాయి. గట్టుమీది గ్రామ శివార్లలో కనుచూపు మేరలో పచ్చదనమే కనిపిస్తూ ఆహ్లాదకర వాతావరణం ఏర్పడింది.


కాద్లాపూర్ శివారులో సాగవుతున్న పంటలు

మరో ఐదేళ్లు అధికారంలో మేమే..

- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్


మోస్రా రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

వర్ని: ప్రస్తుత పదవీకాలంతోపాటు రాబోయే మరో ఐదేళ్లపాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మోస్రా మండల కేంద్రంలోని సీతారామ ఆలయంలో ఆదివారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు అన్నింటినీ నెరవేరుస్తున్నామని, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్నారని వివరించారు. పదేళ్ల బీఆర్ఎస్ దోపిడీ రాజ్యానికి ప్రజలు చరమగీతం పాడారని, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రజాపాలన కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. అన్నివర్గాల వారికి సమన్యాయం చేస్తూ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని, ఇదే స్ఫూర్తితో మరో ఐదేళ్లపాటు పాలన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పెద్దమల్లారెడ్డి జెడ్పీహెచ్ఎస్ 1996-97 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1996–97 విద్యార్థులు ఆదివారం స్థానిక వీరభద్ర ఫంక్షన్‌హాల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులంతా 28 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో భావోద్వేగానికి గురయ్యారు.ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ యోగక్షేమాలు తెలుసుకున్నారు.అనంతరం తమకు చదువు చెప్పిన ఆనాటి ఉపాధ్యాయులను సత్కరించి వారి ఆశీర్వాదం పొందారు. వచ్చే ఏడాది కుటుంబీకులతో కలిసి సమ్మేళనం నిర్వహించాలని తీర్మానించుకున్నారు. పాఠశాల అభివృద్ధికి సైతం కృషిచేస్తామన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007–08 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం 'పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం' నిర్వహించారు. మిత్రులంతా ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఆలింగనం చేసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. ఆనాటి ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, విందులతో ఉత్సాహంగా గడిపారు.


అర్గుల్ జెడ్పీహెచ్ఎస్ 2007-08 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

నేడు ఎస్‌జీఎఫ్ జిల్లా వార్షిక సమావేశం

నిజామాబాద్‌నాగారం: ఎస్‌జీఎఫ్ జిల్లా వార్షిక సమావేశం సోమవారం నగరంలోని టీఎన్‌జీవో భవన్‌లో నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ కార్యదర్శి నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా డీఈవో అశోక్, డీసీఈబీ సెక్రెటరీ సీతయ్య పాల్గొంటారన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులందరూ హాజరుకావాలని కోరారు.

క్లుప్తంగా

శిథిలావస్థలో వాటర్ ట్యాంక్




కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ గ్రామంలోని 13వ వార్డులో వాటర్ ట్యాంక్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. చుట్టు పక్కల మొత్తం పాకురు పట్టి ఎప్పుడు కూలుతుందోనని వార్డు కాలనీ వాసులు భయందోళన వ్యక్తం చేస్తున్నారు. వాటర్ ట్యాంక్ కింద పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ఈ విషయమై అప్పటి కౌన్సిలర్ శంకర్‌రావు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్‌ను వెంటనే తొలగించి దాని స్థానంలో నూతన వాటర్ ట్యాంక్‌ను నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పాఠశాల చెంత.. ట్రాన్స్‌ఫార్మర్‌తో చింత



బాన్సువాడ రూరల్: మండలంలోని కొత్తాబాది గ్రామంలో రోడ్డుపక్కనే కొన్నేళ్లుగా ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నా దానికి కంచెలేదు. ట్రాన్స్‌ఫార్మర్ ప్రభుత్వ పాఠశాల ప్రహరీకి ఆనుకుని ఉండటంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భయాందోళనలకు గురవుతున్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, గిరిజన పాఠశాల, ఉన్నత పాఠశాల విద్యార్థులు ట్రాన్స్‌ఫార్మర్ సమీపం నుంచే పాఠశాలకు వెళ్తారు. ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాల్లో ఖాళీసమయంలో ఆడుకుంటారు. దీంతో ఏక్షణంలో ఏప్రమాదం చోటు చేసుకుంటుదోనని ఉపాధ్యాయులు పహారా కాయాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నోరు తెరిచిన బోరుబావి



బాన్సువాడ రూరల్: మండలలోని కాద్లాపూర్ గ్రామ శివారులో రోడ్డు పక్కన మక్కచేనులో బోరుబావి గుంత ప్రమాదకరంగా ఉంది. బోరుబావి తవ్వించగా ఆశించిన స్థాయిలో నీళ్లపడక పోవడంతో రైతు కేసింగ్ తొలగించి గుంతను పూడ్చకుండా ఇలా వదిలేశారు. దీంతో ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి నోరుతెరిచిన బోరుబావిని రైతుతో పూడ్చివేయించాల్సిన అవసరం ఉంది.

ఆపన్నహస్తం అందించండి

- రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ దోమకొండకు చెందిన శ్రీధర్
- బ్రెయిన్ సర్జరీ కోసం రూ.10లక్షలు అవసరం
- దాతల కోసం బాధిత కుటుంబీకుల ఎదురుచూపులు



దోమకొండ: నిరుపేద కుటుంబానికి చెందిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, ఆస్పత్రిలో చికిత్స కోసం సుమారు రూ.10 లక్షలు వరకు అవుతాయని వైద్యులు పేర్కొన్నారు. దీంతో బాధిత కుటుంబీకులు దాతల చేయూత కోసం ఎదురుచూస్తున్నారు. దోమకొండకు చెందిన బలవత్రి శ్రీధర్‌తోపాటు మరో ఇద్దరు వ్యక్తులు కలిసి శనివారం రాత్రి రామారెడ్డి నుంచి దోమకొండకు ట్రాక్టర్ ట్రాలీని తీసుకువస్తున్నారు. కామారెడ్డి పట్టణ శివారులోని క్యాసంపల్లి వద్ద ట్రాక్టర్ ట్రాలీని వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీధర్ తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని సురారం మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. కాగా శ్రీధర్‌కు బ్రెయిన్ సర్జరీ చేయాలని, ఇందుకు దాదాపు రూ. 10లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో తాము పేద కుటుంబానికి చెందిన వారిమని, తమకు రూ.10 లక్షలు ఖర్చుపెట్టుకునే స్తోమత లేదని శ్రీధర్ తండ్రి శ్రీనివాస్, తల్లి వెంకటలక్ష్మి ఆవేదన చెందుతున్నారు. తమ కుమారుడికి దాతలు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలన్నారు. సహాయం చేయవలసిన దాతలు శ్రీధర్ అన్న శ్రీకాంత్ ఫోన్‌నెంబర్ 7013951924కు ఫోన్‌పే, లేదా గూగుల్ పే చేసి సహాయం అందించాలని కోరారు.

క్రైం కార్నర్

దుబాయిలో సోమారంపేట వాసి మృతి

మాచారెడ్డి: మండలంలోని సోమారంపేటకు చెందిన ఓ యువకుడు దుబాయిలో అనుమానాస్పదంగా మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన గూగులోతు రవి (32) మూడేళ్ల క్రితం బతుకుదెరువు కోసం దుబాయి వెళ్లాడు. తన గదిలో ఆదివారం అతడు అనుమానాస్పదంగా మృతి చెందినట్లు గ్రామస్తులు ద్వారా తెలిసింది. ప్రభుత్వం స్పందించి రవి మృతదేహాన్ని త్వరగా స్వగ్రామానికి తెప్పించాలని గ్రామస్తులు కోరారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కన్కల్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడిచేసి పేకాడుతున్న ముగ్గురిని అరెస్టు చేయగా, ఇద్దరు పరారయ్యారని ఎస్సై మురళి తెలిపారు. విశ్వసనీయ సమాచారం రావడంతో పేకాట స్థావరంపై దాడిచేసినట్లు పేర్కొన్నారు. ఐదుగురు పేకాడుతుండగా పోలీసులు దాడి చేయగా ఇద్దరు పరారయ్యారు. మిగిలిన ముగ్గురిని పోలీసులు పట్టుకొని, వారి వద్ద ఉన్న రూ.2850 నగదు, మూడు బైక్‌లు, మూడు ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

బాన్సువాడ: పట్టణంలోని కోనా బాన్సువాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించే పురుషోత్తం అనే ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు. పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న తారాచంద్‌కు పురుషోత్తంకు మధ్య శనివారం గొడవ జరిగింది. తారాచంద్ తలపై పురుషోత్తం వాటర్ బాటిల్‌తో కొట్టగా ఆయనకు తీవ్ర గాయమైంది. దీంతో తారాచంద్ బాన్సువాడ పోలీస్‌స్టేషన్‌లో పురుషోత్తంపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అలాగే తారాచంద్ తనను ఇష్టం వచ్చినట్లు దూషించడని పురుషోత్తం కూడా ఆయనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

శోభాయాత్రలో విద్యుత్‌షాక్‌తో ఒకరికి గాయాలు


ఆర్మూర్‌టౌన్: పట్టణంలో ఆదివారం నిర్వహించిన వినాయకుడి నిమజ్జన శోభాయాత్రలో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి విద్యుత్ షాక్‌తో గాయపడ్డాడు. రాంనగర్ మండప నిర్వాహకులు వినాయకుడిని నిమజ్జనానికి ప్రత్యేక వాహనంలో తీసుకువెళ్లారు. హుస్నాబాద్‌కాలనీకి రాగానే రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ వైర్లు వినాయకుడికి తగిలాయి. దీంతో వినాయకుడి పక్కనే పడుకొని ఉన్న నితిన్ అనే వ్యక్తికి కరెంట్ షాక్ తగలంతో గాయపడ్డాడు. వెంటనే స్థానికులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు.

వైద్యశిబిరానికి స్పందన



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పొల్కంపేట గ్రామంలో ఆదివారం రామకృష్ణ మఠం గ్రామశ్రీ సేవా వారి ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి అనూహ్య స్పందన లభించినట్లు మండల వైద్యాధికారి రాంబాయి తెలిపారు. ముందుగా ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి ఆరోగ్య పరీక్షలు చేసుకొని శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామానికి చెందిన 252 మందికి పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు తెలిపారు. పలువురికి రక్త నమూనాలు సేకరించినట్లు తెలిపారు.సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్, తహసీల్దార్ సురేష్, ఎంపీవో మలహరి, కార్యదర్శి అశ్వక్, వైద్య సిబ్బంది గణేష్, రజినీ, ఆశావర్కర్లు తదితరులున్నారు.

భీమ్‌గల్‌లో పోలీస్ వాహనం ధ్వంసం



మోర్తాడ్(భీమ్‌గల్): భీమ్‌గల్‌లో వినాయక నిమజ్జనం సందర్భంగా పోలీసులు బందోబస్తు నిర్వహించగా తమ వినోదానికి అడ్డు చెప్పారనే కక్షతో ముగ్గురు యువకులు పోలీసుల వాహనంపై రాళ్లు రువ్వి అద్దాలను పగులగొట్టారు. శనివారం రాత్రి చోటు చేసుకున్న ఘటనను దృష్టిలో ఉంచుకున్న ముగ్గురు యువకులు ఆదివారం ఉదయం భీమ్‌గల్ పోలీసుల వాహనంపై రాళ్లు రువ్వారు. ఈ విషయమై ఎస్సై సందీప్ మాట్లాడుతూ.. తమ వాహనంపై రాళ్లతో దాడి చేసి తమ విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.